అమృతం

డాక్టర్ నక్కా విజయరామరాజు

గుంటూరులో ఏసి కాలేజిలో ఇంటర్ ఫస్టియర్‌లో చేరాను. హాస్టల్‌లో వుండి కాలేజీకి వెళ్లేవాడ్ని. అన్నీ సర్దుకుని క్లాసులు మొదలయ్యేసరికి మా కాలేజీకి దసరా సెలవలిచ్చారు. దసరా సెలవులంటే దాదాపు అక్టోబర్ నెలంతా సెలవులే. కాలేజీ మూసేస్తే హాస్టలు కూడా మూసేస్తారు కదా మరింక. ఇంటికెళ్లాల్సిందే. హాస్టల్లోనైతే రోజు ఉదయం టిఫిను, మధ్యాహ్నం, రాత్రి కడుపునిండా భోజనం పెడతారు.

భట్టిప్రోలు కథలు

రూముల్లో వెచ్చగా పడుకోవచ్చు. ఇంటికెళితే ఏముంది? సెలవులన్నీ ఇంట్లో బయటా వానలో తడుస్తూ గడపాల్సిందే. వానలు నెలల తరబడి కురిసేవి. పొడి నేల చూద్దామన్నా కనబడేది కాదు. వర్షాకాలమంటే ఇష్టమున్నా, దసరా సెలవులంటే మాత్రం ఇష్టముండేది కాదు. అయినా తప్పదుగా. నాతోటి విద్యార్థులంతా ఇంటికెళ్లాలన్న తొందరలో పెట్టెలు సర్దుకొని ముందురోజే వెళ్లిపోయారు. ఇంటి నుంచి మనియార్డర్ రాలేదు. నాకు ఛార్జీలు లేక ఆగిపోయాను. మాది భట్టిప్రోలు దగ్గరొక పల్లెటూరు. గుంటూరు నుంచి మా వూరి మీదుగా బస్సులుంటాయి. కానీ ఛార్జీలెక్కువ. అదే రైలు బండయితే రెండు రూపాయలే! ఆ ముందు రోజే క్లాస్‌మేట్ ధర్మారావుని అప్పడిగాను. ఒక్క రూపాయి కూడా లేదన్నాడు. అమ్మతోడు అని ఒట్టు కూడా వేసుకున్నాడు. ఇంకా ఒకరిద్దరిని అడిగితే వాళ్లు కూడా లేవన్నారు. నిజంగానే వాళ్ల దగ్గర డబ్బుల్లేవనుకున్నాను. కానీ ఆ మధ్యాహ్నం వాళ్లంతా మ్యాట్నీ సినిమాకెళ్తే బాధేసింది.

ఎలాగైనా ఇంటికెళ్లాలని నిర్ణయించుకున్నాను. చేతిలో పైసా లేదు. లగేజీతో ఎలా? వర్షం కురుస్తూనే వుంది. సాయంత్రం ఐదున్నర గంటల రైలుకెళ్దామనుకొని నా ట్రంకు పెట్టెతో స్టేషన్‌కు చేరాను. ప్రయాణీకులతో స్టేషన్ యమ రద్దీగా వుంది. స్టూడెంట్స్, ఎంప్లాయిస్ అందరూ ఆ ట్రైన్‌కే వెళతారు.

టిక్కెట్టు కౌంటరు పైన వున్న 'టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేయడం నేరం. అందుకు జైలు శిక్ష, రెండు వందల రూపాయల జరిమానా విధించబడును' అనే నోటీసు బోర్డు నన్ను భయపెట్టింది. నేనెప్పుడూ టిక్కెట్టు కొనకుండా రైలు ప్రయాణం చేయలేదు. టిక్కెట్టు లేకుండా రైలు ఎక్కితే, టిక్కెట్టు కలెక్టరు పట్టుకుంటే ఫైను కట్టమంటాడు. నా దగ్గర డబ్బుల్లేవంటే జైలులో పెడతారు. తర్వాత మా నాన్నకి కబురెడతారు. అంజియ్య గారబ్బాయి టిక్కెట్టు కొనకుండా రైలెక్కి, జైలుకెళ్లాడంటే మా ఊర్లో ఎంత అప్రతిష్ట, పరువునష్టం!

టిక్కెట్టు లేకుండా రైలెక్కొద్దని అంతరాత్మ ఎదురు తిరిగింది. మరి ఎలా? ఈ ట్రంకు పెట్టెని నెత్తిన పెట్టుకొని కుండపోత వానలో డెబ్బై కిలోమీటర్లు నడిచి వెళ్లడం మాటలా? హాస్టల్ మూసేయడం వల్ల రెండ్రోజుల్నుంచి కడుపులో ద్రవపదార్థం తప్ప ఘనపదార్థమే పడలేదాయే! ఎట్లాగా? ట్రంకు పెట్టె మీద కూర్చుని ఆలోచించసాగాను. రైల్వే కూలీనడిగితే పదిగంటలకు రేపల్లె వెళ్లే ఇంకో రైలుందని చెప్పాడు. అయితే అది తెనాలిలో గంట పైగా ఆగి మరలా బయలుదేరుతుందట! అట్టయితే భట్టిప్రోలు చేరడానికి అర్థరాత్రి ఒంటిగంటపైనే పడుతుంది. 'దెయ్యాల బండి' అంటే ఇదే కాబోలు. మా నాన్న, ఎప్పుడైనా తెనాలి వెళ్లి వచ్చినప్పుడు చెబుతూ వుండేవాడు. 'దెయ్యాలబండి' ఎక్కొచ్చానని.

నాకు కొంచెం భయం వేసింది. గుంటూరు నుంచి రేపల్లె వెళ్లి ప్యాసింజర్ రైలు 'ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం నుంచి బయలుదేరడానికి సిద్ధంగా వుందనే' ఎనౌన్స్‌మెంటు వినిపిస్తూనే వుంది. దాని మానాన దాన్ని పోనియ్యి. నేనైతే పది గంటలకు బయల్దేరే దెయ్యాల బండికే వెళ్దామని నిర్ణయించేసుకున్నాను. దెయ్యాల బండికెళ్లే ప్యాసింజర్లు ఎక్కువగా వుండరు కాబట్టి టిక్కెట్ల కలెక్టర్లు రారని, చెకింగే వుండదని ధర్మారావు చెప్పగా గుర్తొచ్చి ఇంకేం దానికే పోదా మనుకున్నాను.

పదిగంటల వరకూ కూర్చోవాలంటే ఇబ్బందిగానే వుంది. స్టేషన్‌లోకి వెళ్లడానికి లేదు. టిక్కెట్లిచ్చే కౌంటర్ వున్న హాల్లోనే వుండాలి. బిచ్చగాళ్లతో, తినుబండారాలమ్మే వాళ్లతో వర్షానికి రాత్రికి తలదాచుకోవడానికి వచ్చిన వాళ్లతో, కుండలు, కంచాలు గోనె సంచుల్లో కావిడి పెట్టెల్లో పెట్టుకొని భార్యాబిడ్డలతో పల్నాడు ప్రాంతాలకెళ్లే కూలీజనంతో గోలగోలగా వుంది. అక్కడే అన్నాలు తినేవారు, చుట్టలు బీడీలు కాల్చేవారు, కబుర్లు చెప్పుకొనేవాళ్లు. పదిగంటలయ్యేసరికి పది యుగాలు గడిచినట్లయింది. ఈలోపు రెండు సార్లు మంచినీటి కుళాయి దగ్గరకెళ్లి కడుపునింపుకొచ్చాను. జనం బిలబిలమంటూ బయటికొస్తున్నారు. రేపల్లె నుంచి రైలొచ్చినట్లుంది. ట్రంకు పెట్టెను తీసుకొని రేపల్లె వెళ్లే రైలు దగ్గరకి వెళ్లాను. జనం పల్చగా వున్నారు. బోగికి ఐదారుగురు కూడా లేరు. ధైర్యం చేసి బోగిలోకెక్కి ట్రంకు పెట్టె పెట్టి దిగొచ్చాను. రైలు బయలుదేరే వరకు ప్లాట్‌ఫారం మీదే వుండడం ఎందుకన్నా మంచిదనుకున్నాను. ఈలోపు ప్లాట్‌ఫారంకి ఈ చివర నుంచి ఆ చివరి దాకా రెండు, మూడు చెక్కర్లు కొట్టాను. నల్లకోటు వేసుకున్న టిక్కెట్టు కలెక్టరు లాంటి వారెవరైనా కనబడతాడేమోనని, అలాంటి వ్యక్తి ఎవరూ కనిపించలేదు. రైలు కూతేసి మెల్లిగా బయలుదేరి, కొంచెం స్పీడందుకుంది. ధైర్యం చేసి రన్నింగ్ ట్రైన్ ఎక్కేశా! రైలు మూడు వంతెనలు, కుగ్లర్ హాస్పిటల్ దాటి విజయవాడ – మంగళగిరి రోడ్డు రైల్వే గేటు దగ్గర స్లో అయింది. ఎవరైనా చెకింగుకొస్తారేమోనని భయమేసింది. ఎవరో చైను లాగినట్టున్నారు. గార్డ్ వచ్చి చెక్ చేసి పచ్చదీపం ఊపగానే రైలు బయలుదేరింది. వేజండ్ల స్టేషన్లో కొంచెంసేపాగింది. ఒకరిద్దరు దిగినట్టున్నారు. ఒక్కరో ఇద్దరో ఎక్కారు. రైలు వానతో పోటీపడుతూ పరిగెడుతోంది. సంగం జాగర్లమూడి స్టేషన్లో ఒక్కరు దిగారు. ఎవ్వరూ ఎక్కలేదు. బకింగ్‌హామ్ కాలువ వంతెన దాటేటప్పుడు రైలు చేసే శబ్దం వింతగా వుంది. కాలువ అంచులు ఒరుసుకుంటూ నిండుగా ప్రవహిస్తోంది. ఆ కాలువలోని నీరే మనం తాగేదని మా హాస్టల్ వార్డెన్ ఫ్రెడరిక్‌గారు చెప్పేవారు. బ్రిటీషు వాళ్లు మనల్ని పాలించేటప్పుడు బెజవాడ నుంచి మద్రాసు వరకు సరుకులు రవాణా అంతా పడవలలోనే ఈ కాలువ మీదుగా సాగేదని మా తాత చల్లాపి రాజారత్నం చెబుతుండేవాడు. ఆయన ఆ కాలువ మీద కళాసీగా పనిచేసేవాడు. ఆ ఆలోచనల్లో వుండగానే రైలు అంగలకుదురు దాటి తెనాలి చేరింది. నేనున్న బోగి సరిగ్గా బండ్లపుల్లయ్య ఫ్రూట్‌స్టాల్ ముందాగింది. ఆ కొట్లో వున్న అమృతపాణి అరటిగెలలు, ద్రాక్షలు, యాపిల్‌పండ్లు చూసేసరికి...మగతగా వున్న ఆకలి నిద్ర లేచింది. ఆ కొట్లో వున్న పండ్లన్నీ తినగల ఆకలది. దాని బాధకు తట్టుకోలేక కుళాయి దగ్గరకు వెళ్లాను. అర్థరాత్రి.. ఆపైన జోరున వాన. స్టేషన్‌లో సందడే లేదు. ఇక్కడొక గంటన్నా గడపాలి! రేపల్లె



నుంచి రైలొస్తే గాని నేనెక్కిన బండి బయల్దేరదు. సింగిల్ లైను. అక్కడున్న సిమెంటు బెంచీ మీద కూర్చోబోయేలోపే ఎవరో బిచ్చగాడు బిస్తరు పరిచాడు. నే కూర్చోవడానికి ఖాళీ లేదు. కాళ్ళు పీకుతున్నాయి. ఒక్క బెంచీ ఖాళీ లేదు. ఉన్నవన్నీ ఇలాంటి వారితో నిండిపోయాయి. వీళ్ళు ఎంత అదృష్టవంతులో కదా! అనుకున్నాను. టిక్కెట్టు కొనలేదన్న భయమూ, ఆకలి లేదు కదా వారికి! స్టేషన్లో ఉన్న సినిమా పోస్టర్లు, ఎడ్వర్టైజ్‌మెంట్లు చూస్తూ దాదాపు గంట పైగా కాలక్షేపం చేశా. అప్పుడప్పుడు కొన్ని ప్యాసింజర్ రైళ్లు, గూడ్సుబండ్లు వచ్చి పోతూనే ఉన్నాయి. ఎందుకన్నా మంచిదని నల్లకోటు వేసుకున్న టిక్కెట్టు కలెక్టరు కోసం స్టేషన్ మొత్తం తిరిగాను. ఎక్కడా ఎలాంటి జాడలేదు. ఈ వాన, చలిలో ఏ రైల్వే రెస్టు రూములోనో రగ్గు కప్పుకుని వెచ్చగా పడుకుని ఉంటారు. నేను నా బోగీ దగ్గరికొచ్చేసరికి టీ స్టాలు ముందు కొందరు పొగలు కక్కుతున్న టీ సాసర్లో పోసుకుని తాగుతున్నారు. వర్షంలో వేడి వేడి టీ తాగటం ఎంత ఆనందం. వెంటనే మా హాస్టల్ కుక్ బెంజిమెన్ ఇచ్చే టీ గుర్తొచ్చింది. అదెంత బాగుంటుందో!

ఆశ చావక జేబులు తడుముకున్నాను, నిరాశే మిగిలింది.

మరికొంతసేపటికి రైలు బయలుదేరింది. రైలెక్కి యథాప్రకారం తలుపు దగ్గరే నిల్చున్నాను. వర్షపుజల్లు పడుతున్నా అక్కడే నిలబడి చీకట్లో వర్షాన్ని చూస్తున్నాను. కరెంటు పోయినట్టుంది. వైకుంఠపురం గుడి మసగ్గా కనిపిస్తోంది. బోగీల్లో సీట్లు లేక కాదు నేను తలుపు దగ్గర నిల్చున్నది. బోగీ అంతా ఖాళీనే. నేను సీట్లో కూర్చుని ఉండగా టిక్కెట్టు కలెక్టరొచ్చి- టిక్కెట్టు లేదని తెలిసి, ''టిక్కెట్టు కొనకుండా దర్జాగా దొరలాగా కూర్చున్నావేరా!'' అని బూతులు తిడతాడేమోనని భయమేసి ప్రయాణమంతా తలుపు దగ్గరే నిలబడాలని ముందే నిర్ణయించుకున్నాను. అందుకే కాళ్ళు విపరీతంగా పీకుతున్నాయి. వాన జల్లుకి బట్టలు ముద్దయినయి.

రైలు జంపని, వేమూరు, పెనుమర్రు స్టేషన్లు కూడా దాటేసింది. ఈ స్టేషన్లో ఒక్కరూ ఎక్కిన, దిగినవారు లేరు. పెనుమర్రు దాటి పెద్ద కాలువ వంతెన మీదకు రైలు వచ్చేసరికి.. ఇక వచ్చేదే భట్టిప్రోలని సంతోషం కలిగింది. అంతలోనే భయం వేసింది. ఇక్కడెవరన్నా టి.సి. ఉండడు కదా! పట్టుకుంటే ఇంకా ప్రమాదం. మా నాన్నకు తెలిసినవారు చాలా మందే ఉన్నారు భట్టిప్రోలులో.

స్టేషనొచ్చింది. పెట్టె పట్టుకుని భయం భయంగా దిగాను. ఇద్దరు ముగ్గురు దిగేరు నాతో పాటు. స్టేషన్‌లో పురుగు లేదు. నా అదృష్టం కొద్దీ కరెంటు కూడా లేదు. భట్టిప్రోలు..భట్టిప్రోలు.. అంటూ రైల్వే కళాసీ అరుచుకుంటూ రైలుకీ చివరి నుంచి ఆ చివరి వరకు పోతున్నాడు.

స్టేషన్ బయటికొచ్చేటప్పుడెవరికంటన్నా పడతానేమోనని భయపడ్డాను. అలాంటి ప్రమాదమేమీ జరగలేదు. స్టేషన్ బయట మెట్ల మీద నుంచున్నాను. ఇప్పుడు నేను స్వేచ్ఛాజీవిని. ఎవరికీ భయపడనవసరంలేదు. అక్కడ్నుంచి మా ఊరెళ్ళే రిక్షాలేమన్నా ఉన్నాయాని చూశాను. ఎవ్వరూ లేరు. వరదయ్య హోటల్ దగ్గర కూడా ఒక్క పురుగు లేదు. దిగిన వారిలో మా ఊరోళ్లెవరైనా ఉన్నారా అని చూశా! వాళ్ళెప్పుడో వెళ్ళిపోయారు. పెట్టె నెత్తిన పెట్టుకుని వర్షంలో తడుస్తూ బయలుదేరాను. ఇక్కడ్నుంచి మా ఊరు ఎంతలేదన్నా ఏడు కిలోమీటర్ల పైమాటే. వేగంగా నడిస్తే రెండు గంటల్లో చేరొచ్చు. ఇంటికెళ్ళగానే ముందుగా కడుపు నిండా అన్నం తినాలి. వెచ్చటి దుప్పటి కప్పుకుని హాయిగా నిద్రపోవాలి. ఆలోచనల్లో ఉండగానే అట్టల మిల్లు దాటి భట్టిప్రోలు బస్టాండు వచ్చింది. జానీ కొట్లో లైటు లేదు. కోటయ్య కొట్లో గుడ్డి దీపం వెలుగుతోంది. ఒక్క పురుగూ మెదలడం లేదు. ఈ టైంలో ఎవరుంటారు నా పిచ్చిగాని! కరింశెట్టి వెంకటేశ్వర్లు గారిల్లు దాటి తమ్మన మల్లిఖార్జునరావు ఉన్నత పాఠశాల దగ్గరికొచ్చాను. దాని వాచ్‌మెన్ పోతురాజు నాకు బాగా తెల్సు. నేను మా అన్నయ్యలందరం చదివిందా స్కూల్లోనే. ఈ రాత్రికి ఏ క్లాసురూమ్‌లోనైనా బెంచీ మీద పడుకుని తెల్లారి లేచి వెళ్తే? ఉహూ! ఆకలి ముందు నిద్రాదేవి ఓడిపోయింది.

వర్షంతో పోటీపడుతూ వేగంగా నడవసాగాను. రోడ్డుకి రెండు వైపులా ఉన్న చింత, మామిడి, నేరేడు చెట్లు గాలికి పిచ్చిగా తలలూపుతున్నాయి. అంతా చీకటయినా అలవాటుపడ్డ బాట కాబట్టి నాకే ఇబ్బంది లేదు. రోడ్డు మీద పురుగు మెదలడం లేదు. ఎప్పుడో ఒకసారెళ్ళే లారీలు తప్ప. దూరంగా అద్దేపల్లి నుంచి కుక్కలు మొరుగుతున్నాయి. అద్దేపల్లి మసీదు, బుర్రతూములు, సాలి చెరువు దాటి ముసలమ్మ సత్రం దగ్గరకు చేరేసరికి అక్కడున్న బావి గుర్తొచ్చింది. ఆ బావిలో నీళ్ళు తాగేవాళ్ళం. మా టిఫిన్ బాక్సుల్లో ఇంట్లో వాళ్ళ కోసం తీసుకెళ్ళేవాళ్ళం. కొబ్బరి నీళ్ళ కంటే తియ్యగా ఉండేవి. బొక్కెన కోసం వెతికాను. చీకటిలో కనబడలేదు. సత్రంలో ఎవరో బిచ్చగాళ్ళు కాశీమజిలీ కథలు చెబుతున్నారు. లోనికెళ్ళి అడుగుదామనుకున్నా కానీ బావిలో నీళ్ళు వంగితే చేతి కందేలా ఉన్నాయి. వంగి దోసిళ్ళతో కడుపు నిండా తాగి బయల్దేరాను. మావూరు బస్టాండు దగ్గరున్న గౌండ్ల అర్జునయ్య ఇల్లు చేరేసరికి అంతా బురదగా వుంది. ఇప్పటివరకు తారురోడ్డు మీద ఇబ్బంది లేకుండా నడిచాను. ఇక్కణ్ణుంచి బురద. మోకాళ్ళ లోతు బురద. ఈ బురదలో నడవడం నాకు కొత్తేమీ కాదు, ఇబ్బంది కూడా కాదు. కొంచెం ఆలస్యం అవుద్ది! ఇంకెంత పదినిమిషాలు నడిస్తే

మా ఇంటికి చేరి కడుపునిండా తిని హాయిగా పడుకోవచ్చు!

మా ఊరు మలుపు నీళ్ళ తొట్టి దగ్గరున్న మద్దాల బసవయ్య గుడిసెల్లోంచి గుడ్డి దీపం వెలుగు కనిపిస్తోంది. ఊళ్ళోకొచ్చిన తర్వాత కరణం గారింటి ముందరున్న పెద్ద కాలువలో కాళ్ళు, చేతులు శుభ్రంగా కడుక్కున్నా. గౌండ్ల ఇళ్ళన్నీ నిశ్శబ్దంగా వున్నాయి. ఈడే వెంకటేశ్వర్లు మాష్టారింటి ముందు మాత్రం వాన నీటితో చెరువులా తయారైంది. అందులో వందల సంఖ్యలో కప్పలు చేరి బెకబెకమంటూ విపరీతంగా శబ్దం చేస్తున్నాయి. షావుకారి పిచ్చయ్య గారి ఇల్లు, సీతారామయ్య

సోడా కొట్టు దాటి, ఇంటి దగ్గరకు రాగానే నా రాక ఎలా పసిగట్టిందో రయ్‌మంటూ మా 'టైగరొ'చ్చి కుయ్‌కుయ్‌మని నా కాళ్ళు చుట్టేసి, తిరిగి ఇంటికి పరుగెత్తింది నా రాక ఇంట్లో వారికి చెప్పడానికి. డోకుపర్తి దీనమ్మ గొడ్లకు గడ్డేస్తూ నన్ను పలకరించింది. ఆ వైపు రోడ్డులో నుంచి సలగాల దుర్గయ్య పాడుతున్న రాయబారం పద్యాలు రాగయుక్తంగా వినిపిస్తున్నాయి. ఇంటికి చేరేసరికి మా నాయనమ్మ, అమ్మ, జయబాబు, నిర్మల అందరూ మెలకువగానే ఉన్నారు. ట్రంకు పెట్టె తీసుకెళ్ళి లోపల పెట్టింది నిర్మల. వారిని చూడగానే నా అలసటంతా మాయమైంది గానీ ఆకలి మాత్రం అట్లాగే వుంది.

ముందుగా''అన్నం పెట్టమ్మా! చాలా ఆకలిగా ఉందన్నాను'', ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. నాకర్థం కాలేదు. మీరు మాట్లాడుకుంటూ ఉండండని చెప్పి, మా నాయనమ్మ ఇంట్లోకెళ్ళింది. తల తుడుచుకొమ్మని తువ్వాలు తెచ్చిచ్చాడు జయబాబు. కుండలో అడుగున మిగిలిపోయిన మెరికలు అప్పటికప్పుడు దంచి, చెరిగి నూకలతో అన్నం వండింది. అన్నం తుక తుక ఉడుకుతుంటే ఎక్కడలేని ఆకలేసింది. బట్టలు మార్చుకుని పొడి బట్టలేసుకున్నాను. పది నిమిషాల్లో గుంట గిన్నెలో వేడి వేడి గంజన్నం పోసుకొచ్చింది మా నాయనమ్మ దాంట్లో ఉప్పుగల్లేసి. ఆ గిన్నెను ఆబగా లాక్కుని అన్నం మొత్తం గబాగబా తినేసి, మిగిలిన గంజి గటగటా తాగేశాను. అంత రుచి గల అన్నం ఇంత వరకూ తినలేదు. అందరూ నా వంకే కన్నార్పకుండా చూస్తున్నారు.

''మీరు తిన్నారా?'' అని అప్పుడడిగాను.

''ఇంట్లో బియ్యం లేక ఈ రోజు అన్నం వండుకోలేదన్నయ్యా'' అని చెప్పింది నిర్మల.

❑